తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం | సూర్యపేట | యాద్రాద్రి భువనగిరి

బుధవారం

09 సెప్టెంబర్ 2026

పేజీలు : 8

Follow :





త్రాగునీటి సమస్య తలెత్తకుండా

## ముందస్తు చర్యలు చేపట్టాలి

### కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు 08(జనంసాక్షి)**

సాగర్, గోదావరి జలాలను త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతతో కాపాడుకోవాలని, రైతులు నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు.మంగళవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పల్లెగూడెం ఎన్ఎస్పీ కాల్వ లింకు కెనాల్ పునరుద్ధరణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాగర్ జలాల ప్రవాహాన్ని పరిశీలించి, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువుకు నీటి సరఫరా జరిగే కాలువ, తూము మరమ్మత్తు పనుల పై మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత కాలువ పరిస్థితి, సాగర్ కాలువ నుంచి ఏదులాపురం చెరువు వరకు ఉన్న దూరం, నీటి సాఫీగా ప్రవహించేందుకు అనువైన పరిస్థితులు తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు.

**వార్తా లోపలి పేజీలో**

## "అంతా సిద్ధం.. తలుపులు తెరిచేదెప్పుడు?"

### జనం సాక్షి ప్రభావంతో పూర్తయిన గండవానిగూడెం పంచాయతీ భవనం

**✸కలరింగ్, కరెంట్, డోర్లు సిద్ధం ప్రారంభోత్సవానికే కరువైన ముహూర్తం**

**✸సొంత భవనం ఉన్నా ఇంకెన్నాళ్లు ఈ అద్దె కొంపలోనే పాలన?**

**మాడుగులపల్లి, సెప్టెంబర్ 08(జనం సాక్షి):** నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజక వర్గం, మాడుగులపల్లి మండల పరిధిలోని గండవానిగూడెం నూతన గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవంపై అధికారులు, ప్రజాప్రతినిధుల అలసత్వం వీడటం లేదు గతంలో ఈ భవనం పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంపై జనంసాక్షి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమైన విషయం విధితమే.

**స్పందించిన యంత్రాంగం పనులన్నీ పూర్తి**

జనంసాక్షి వార్తల ప్రభావంతో ఎట్టకేలకు స్పందించిన అధికారులు భవనానికి సంబంధించిన విద్యుత్ సౌకర్యం, కలరింగ్, డోర్లు అమర్చడం, ప్రింటింగ్ పనులతో పాటు మిగిలిపోయిన చిన్నచిన్న పనులన్నింటినీ శరవేగంగా పూర్తి చేయించారు జనంసాక్షి చొరవతో సర్వాంగ సుందరంగా భవనం సిద్ధమైనప్పటికీ, ప్రారంభించడంలో మాత్రం యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది

**అంతా సిద్ధం ప్రారంభానికేది ముహూర్తం?**

ప్రస్తుతం నూతన భవనంలో ప్రతి పని వంద శాతం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది కానీ తలుపులు తెరవడానికి మాత్రం అధికారులు, ప్రజాప్రతినిధులకు ముహూర్తం కుదరడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు స్థానిక ప్రజాప్రతినిధుల సమయం దొరకడం లేదనే నెపంతోనే ప్రారంభాన్ని నిలిపివేశారా? అని పల్లె జనం నిలదీస్తున్నారు

**ఇప్పటికీ అద్దె భవనంలోనే నరకం**

ఒకవైపు అన్ని వసతులతో సొంత భవనం సిద్ధంగా ఉన్నప్పటికీ, పంచాయతీ పాలన మాత్రం నేటికీ అద్దె భవనంలోనే కొనసాగుతుండటం గమనార్హం నెలానెలా ప్రజాధనాన్ని అద్దెల రూపంలో వృథా చేస్తూ, అరకొర వసతుల మధ్య సిబ్బంది, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు మూసి ఉన్న భవనంలో ఫర్నిచర్, కరెంట్ వైరింగ్ పాడైతే బాధ్యత ఎవరిదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆర్భాటాలకు పోకుండా తక్షణమే గండవానిగూడెం పంచాయతీ భవనాన్ని ప్రారంభించి ప్రజా వినియోగానికి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు లేనిపక్షంలో అద్దె భవనం వద్ద గ్రామస్తులతో కలిసి ప్రత్యక్ష నిరసన చేపట్టక తప్పదని హెచ్చరిస్తున్నారు.

హుజూర్ నగర్ లో అత్యంత వైభవంగా

## ముత్యాలమ్మ జాతర

**హుజూర్ నగర్, సెప్టెంబర్ 6 (జనంసాక్షి):**



పట్టణంలో అత్యంత వైభవంగా ముత్యాలమ్మ జాతర ఘనంగా నిర్వహించామని ముత్యాలమ్మ జాతర నిర్వాహకులు తెలిపారు. సోమవారం చిన్న ముత్యాలమ్మ తల్లికి ఘనంగా మహిళలు బోనాలు ఎత్తి, ప్రజలు కోళ్లు, మేకపోతుల మొక్కులను చెల్లించి, మహిళలు బోనాలు అమ్మవారికి సమర్పించి ప్రజలంతా అమ్మవారిని దర్శించుకున్నారు. పదో తేదీన కనకదుర్గమ్మ అమ్మవారి జాతర ఉత్సవంతో కార్యక్రమం ముగుస్తుంది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు వారు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ముత్యాలమ్మ జాతర ప్రశాంతంగా ముంచేందుకు భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. జాతరలో రైతులు ట్రాక్టర్లలో రంగురంగుల ప్రభలు కట్టి జాతరలో పాల్గొని దేవాలయం చుట్టూ ప్రదర్శనలు చేపట్టారు. అమ్మవారి దయవల్ల వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు పండి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు.

## పోచంపల్లికి అదనపు బస్సు ప్రారంభం

### జనంసాక్షి వరుస కథనాలతో స్పందించిన ఆర్టీసీ అధికారులు

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):**


పోచంపల్లికి బస్సుల కష్టాలు..
ప్రయాణికులకు నిత్య అవస్థలు



పోచంపల్లి దిల్‌సుఖ్‌నగర్ మధ్య ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించడం లేదని, రద్దీకి బస్సులు సరిపోవడం లేదని విద్యార్థులు, ప్రయాణికులు అనేకసార్లు డిపో మేనేజర్‌కు వినతులు సమర్పించారు. ఈ సమస్యపై జనం సాక్షిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన ఆర్టీసీ అధికారులు బస్సుల సమయాలను సర్దుబాటు చేసి నిర్ణీత సమయానికి నడిచేలా చర్యలు చేపట్టారు. అదనపు బస్సుల అవసరాన్ని పరిశీలించేందుకు పోచంపల్లి ప్రధాన బస్‌స్టాప్‌లో సిబ్బందిని ఏర్పాటు చేసి రద్దీని పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం పోచంపల్లి నుంచి హైదరాబాద్‌కు నేరుగా వెళ్లేలా అదనపు బస్సును ప్రారంభించారు. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు, పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ డిపో మేనేజర్, ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరోగ్య మహిళతో.. మహిళల ఆరోగ్యానికి భరోసా

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ నిరంతర పర్యవేక్షణలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు**




**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 08 (జనంసాక్షి )**

మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. కుటుంబ సభ్యుల ఆరోగ్యం, పిల్లల సంరక్షణ, ఇంటి బాధ్యతల్లో నిత్యం నిమగ్నమయ్యే మహిళలు చాలా సార్లు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం మరిచిపోతుంటారు. చిన్నపాటి ఆరోగ్య సమస్యను కూడా నిర్లక్ష్యం చేస్తూ.. తీవ్రమైన సమస్యగా మారిన తర్వాత ఆసుపత్రిని ఆశ్రయించే పరిస్థితులు కనిపిస్తుంటాయి. ముఖ్యంగా క్యాన్సర్ వంటి వ్యాధులను ప్రారంభ దశలో గుర్తిస్తే సకాలంలో చికిత్స అందించే అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమం ఖమ్మం జిల్లాలో మహిళల ఆరోగ్యానికి ఒక రక్షణ కవచంలా నిలుస్తున్నది.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పర్యవేక్షణలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సర్వజన ప్రభుత్వ వైద్య విభాగం సమర్థవంతంగా అమలు చేస్తున్నది. జిల్లాలోని సర్వజన ఆసుపత్రిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి మంగళవారం, గురువారం నిపుణులైన మహిళా వైద్యులచే మహిళలకు ప్రత్యేకంగా ఉచితంగా ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. ఓపీ నమోదు నుంచి స్క్రీనింగ్, పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, అవసరమైన ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫరల్, చికిత్స అనంతరం ఫాలో అప్ వరకు సేవలను అనుసంధానం చేస్తున్నారు. మహిళలు తమ ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ వైద్య కేంద్రాల్లోనే ఆరోగ్య మహిళ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఓపీ నమోదు, ఆన్‌లైన్ డేటా నమోదు, ప్రాథమిక ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరాన్ని బట్టి వివిధ రకాల అధునాతన పరీక్షలు నిర్వహిస్తున్నారు.

# ఒకే కుటుంబంలో ముగ్గురికి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌లు.

## హాలియా పట్టణానికి అరుదైన ఘనత




**హాలియా, సెప్టెంబర్ 8 జనంసాక్షి :** నల్గొండ జిల్లా హాలియా పట్టణానికి చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు ప్రతిష్ఠాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పరిశోధనా డాక్టరేట్ పట్టాలు అందుకొని అరుదైన ఘనత సాధించారు. హాలియా మున్సిపాలిటీ పరిధికి చెందిన కుకుడాల ఆంజనేయులు, కుకుడాల హైమావతి, కుకుడాల బాలకృష్ణ ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన 85వ స్నాతకోత్సవంలో పరిశోధనా డాక్టరేట్ పట్టాలను అందుకున్నారు. సెప్టెంబర్ 8, 2026న ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఠాగూర్ ప్రాంగణంలో జరిగిన స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ చేతుల మీదుగా వీరు డాక్టరేట్ పట్టాలను స్వీకరించారు. కుకుడాల ఆంజనేయులు వాణిజ్య విభాగంలో, కుకుడాల హైమావతి వృక్షశాస్త్రంలో, కుకుడాల బాలకృష్ణ సామాజిక శాస్త్రంలో పరిశోధనలు పూర్తి చేసి డాక్టరేట్ పట్టాలను పొందారు. చిన్నతనం నుంచే కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, మొక్కవోని దీక్షతో ఉన్నత విద్యను అభ్యసిస్తూ తమ లక్ష్యాలను సాధించారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి అత్యున్నత విద్యార్హతను పొందడం పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కుకుడాల ఆంజనేయులు హాలియా పట్టణంలోని శ్రీశ్లోక పాఠశాల అధ్యక్షుడిగా, కుకుడాల హైమావతి అనుముల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ప్రత్యేక అధికారిణిగా, కుకుడాల బాలకృష్ణ నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఘన విజయానికి తమ వెన్నంటే నిలిచి పరిశోధనలకు మార్గనిర్దేశం చేసి ప్రోత్సహించిన ఆచార్యులకు, కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.




# సూర్యాపేటకు రైల్వే సౌకర్యం కల్పించాలి

### లక్ష పోస్ట్‌కార్డుల ఉద్యమంకు తీకుళ్ళ సాయిరెడ్డి మద్దతు

### రైల్వే సాధన సమితి పోరాటానికి అభినందనలు

**సూర్యాపేట (జనంసాక్షి):**
హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు సాధారణ రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట రైల్వే సాధన సమితి చేపట్టిన లక్ష పోస్ట్‌కార్డుల ఉద్యమంకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర పూర్వఅధ్యక్షులు తీకుళ్ళ సాయిరెడ్డి తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి స్వయంగా పోస్ట్‌కార్డు రాసి సూర్యాపేట ప్రజల రైల్వే ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సూర్యాపేటకు హైదరాబాద్ నుంచి రైలు మార్గం కావాలన్నది ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అని సాయిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న సూర్యాపేటకు నేరుగా రైల్వే అనుసంధానం లేకపోవడం ప్రజలకు తీవ్ర లోటుగా ఉందన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయ అవసరాలతో నిత్యం హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వేలాది మంది ప్రజలకు రైలు సౌకర్యం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఒక లక్ష మంది ప్రజలతో ప్రధానమంత్రికి పోస్ట్‌కార్డులు పంపించాలన్న రైల్వే సాధన సమితి నిర్ణయం వినూత్నమైన ప్రజాస్వామ్య ఉద్యమమని అభినందించారు. ఒక ప్రాంత అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాన్ని సాధించేందుకు ప్రజలను భాగస్వాములను చేస్తూ ఉద్యమాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఒక్కొక్కరి చేతిలోని చిన్న పోస్ట్‌కార్డు లక్ష గొంతుకలుగా మారి ఢిల్లీకి సూర్యాపేట ప్రజల ఆకాంక్షను వినిపించగలదని, ప్రజల నుంచి ఎంత విస్తృతమైన స్పందన వస్తే రైల్వే మార్గం అవసరాన్ని కేంద్ర ప్రభుత్వం అంత బలంగా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ పోరాటానికి తన మద్దతు కొనసాగుతుందని తెలిపారు.

## ఎం.ఈ.ఎఫ్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ గా డాక్టర్ కత్తి



**మునగాల, సెప్టెంబర్ 08(జనంసాక్షి):** మాదిగ ఉద్యోగ సమైక్య జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ గా మండలంలోని విజయరామపురం గ్రామానికి చెందిన డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లును నియమించినట్లుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. వీరు విద్యార్థి దశలో 1995లో ఉమ్మడి నల్గొండ జిల్లా మాదిగ విద్యార్థి సంఘం జిల్లా కోకన్వీనర్ గా, తదనంతరం 1996లో ఉస్మానియా యూనివర్సిటీ మాదిగ విద్యార్థి సమాఖ్య కన్వీనర్ గా పనిచేశారు .1998లో ఉపాధ్యాయునిగా నియామకమైన తర్వాత మాదిగ ఉద్యోగ సంఘంలో కోదాడ నియోజకవర్గ కార్యదర్శిగా పనిచేశారు. తర్వాత ఉమ్మడి నల్గొండ జిల్లా మాదిగ ఉద్యోగ సంఘ సంయుక్త కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాదిగ ఉద్యోగ సంఘం సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. 2021 నుండి 26 మొన్నటి వరకు ఉద్యోగుల సంఘం ఎం.ఈ.ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత 33 సంవత్సరాల నుండి పనిచేసుకుంటూ కృష్ణ మాదిగ వెంట నిబద్ధతతో పనిచేసుకుంటూ ఎమ్మార్పీఎస్ నాయకులతో సమన్వయంతో పని చేస్తూ వర్గీకరణ ఉద్యమంలో విద్యార్థిగా, ఉద్యోగిగా తన కృషికి గుర్తింపుగా ఉద్యోగ సంఘంలో అత్యున్నతమైన ఎం.ఈ.ఎఫ్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్గా నియమితులైనారు .ఈ సందర్భంగా డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గత 33 సంవత్సరాల నుండి మాదిగ జాతి సేవకు గుర్తింపుగా మందకృష్ణ మాదిగ అప్పజెప్పిన బాధ్యతను గౌరవంగా భావిస్తున్నానని, వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ, వారు ఆశించిన విధంగా పనిచేస్తానని తెలిపారు.

## స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి



**నూతనకల్ సెప్టెంబర్ 8 (జనంసాక్షి) :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నకిరేకంటి వెంకన్న రాజ్యాంగ పరిరక్షణ సమితి మండల కోఆర్డినేటర్ నకిరేకంటి మధులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ స్పీకర్ పై చేసిన పరుష పదజాలంతో చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. అట్టి వ్యాఖ్యలను ఉపసంహరించుకొని స్పీకర్ కు తెలంగాణ ప్రజలకు తాతా మధు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ శ్రీకాంత్ రవి నరేష్ శ్రావణ్ మన్సూర్ దాసు చంద్రయ్య వీరసోములు వీరయ్య సురేష్ సైదులు వీరబాబు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి:కలెక్టర్

సాధ్యమైనంత త్వరితగతిన కాలువ, తూము పునరుద్ధరణ పనులను పూర్తిచేయాలని, త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలం పరిధిలో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పై ఆరా తీశారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఏ ఒక్కరు మిస్ కాకుండా ప్రతి ఒక్కరిని హియరింగ్ కు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలను అందించేందుకు సైతం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద జలాల పరిస్థితిని పరిశీలించారు. అధికారులు, ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ, వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ× ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో గోదావరి, సాగర్ నుంచి తరలిస్తున్న నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించాలని, త్రాగునీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రాధాన్యత క్రమంలో నీటిని వినియోగించాలని అన్నారు. వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

నీటి ప్రవాహాల్లో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా కాలువలు, రెగ్యులేటర్లు, అవుట్‌లెట్లను నిరంతరం తనిఖీ చేయాలని, నీటి లభ్యతను బట్టి చెరువులను నింపేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇర్రిగేషన్ సీఈ వాసంతి, ఖమ్మం ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్డీవో శ్రీనివాస్, వైరా ఈఈ బాబురావు, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, తహసీల్దార్లు వినయేందర్ రెడ్డి, అరుణ, ఇరిగేషన్ ఏఈ విక్రమ్ తో పాటు పలువురు మున్సిపల్, ఇరిగేషన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్య మహిళతో.. మహిళల ఆరోగ్యానికి భరోసా

ముఖ్యంగా 35 సంవత్సరాలు పైబడిన మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్× పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మామోగ్రామ్, పాప్‌స్మియర్, రక్త పరీక్షలు, ఉదర భాగం అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే, ఈసీజీ వంటి పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. రొమ్ములో గడ్డలు వంటి అనుమానాస్పద లక్షణాలను గుర్తించడంతో పాటు అవసరమైన వారికి ఎఫ్ఎన్ఏసీ, కాల్పోస్కోపీ, సర్వైకల్, ఎండోమెట్రియల్ బయాప్సీ వంటి తదుపరి పరీక్షలు నిర్వహిస్తున్నారు. కుటుంబ నియంత్రణ సేవలు, శస్త్రచికిత్స ఓపీ సేవలు, తదితర సేవలు కూడా అందిస్తున్నారు.

క్యాన్సర్ అంటే భయపడటం కాదు.. ముందుగానే గుర్తించడం ముఖ్యం. ప్రారంభ దశలో వ్యాధిని గుర్తించి సకాలంలో చికిత్స తీసుకుంటే ఆరోగ్య పరిస్థితిని మెరుగు పరుచుకునే అవకాశం ఉంటుంది. ఇదే ఉద్దేశ్యంతో ఆరోగ్య మహిళ కార్యక్రమంలో ముందస్తు స్క్రీనింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు.

మామోగ్రామ్, పాప్‌స్మియర్, అల్ట్రాసౌండ్ వంటి పరీక్షల్లో ఏదైనా అనుమానాస్పద ఫలితం వస్తే అక్కడితో వదిలేయకుండా తదుపరి పరీక్షలకు పంపిస్తున్నారు. అవసరమైన చోట బయాప్సీ, ఎఫ్ఎన్ఏసీ, కాల్పోస్కోపీ వంటి పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు. నిర్ధారణ అయిన కేసులకు అవసరమైన చికిత్స కోసం హైదరాబాద్‌తో పాటు ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేస్తున్నారు. ఖమ్మం సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. నరేందర్ నిరంతర పర్యవేక్షణ చేస్తూ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందుకు ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా అందుతున్న సేవల గణాంకాలే నిదర్శనం. 2023 మార్చి 8 నుంచి 2026 ఆగస్టు 31 వరకు 49,202 ఓపీ సేవలు నమోదయ్యాయి ఈ కాలంలో 4,900 పాప్‌స్మియర్ పరీక్షలు నిర్వహించగా, 264 కేసుల్లో అసాధారణ ఫలితాలు గుర్తించారు. అలాగే 6,102 మామోగ్రామ్ పరీక్షలు నిర్వహించగా, 973 కేసుల్లో అసాధారణ ఫలితాలు నమోదయ్యాయిఉదర భాగానికి సంబంధించిన సమస్యలను గుర్తించేందుకు 9,149 అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించారు. కాల్పోస్కోపీ ద్వారా 245 మందికి సేవలు అందించగా, క్రయోథెరపీ సేవలు 22 మందికి అందించారు. ఇలా ఒక మహిళ ఆసుపత్రికి వచ్చినప్పటి నుంచి పరీక్షలు నిర్వహించడం, అనుమానిత కేసును గుర్తించడం, వ్యాధిని నిర్ధారించడం, అవసరమైతే ఉన్నత వైద్య కేంద్రానికి పంపించడం, చికిత్స అనంతరం పర్యవేక్షించడం వరకు ఒక సమగ్ర వైద్య వ్యవస్థగా కార్యక్రమం కొనసాగుతున్నది 260 మందిలో క్యాన్సర్ గుర్తింపు: ముందస్తు స్క్రీనింగ్ ఎంత కీలకమో ఖమ్మం జిల్లాలో నమోదైన ఫలితాలు తెలియజేస్తున్నాయి. గుర్తించిన కేసుల్లో అత్యధికంగా 109 మందిలో రొమ్ము క్యాన్సర్, 82 మందిలో సర్వైకల్ క్యాన్సర్ బయటపడ్డాయి. వీటితో పాటు నోటి క్యాన్సర్, ఉదర భాగానికి సంబంధించిన క్యాన్సర్, అండాశయ మాలిగ్నెన్సీ, జీఈ జంక్షన్ క్యాన్సర్, రెక్టం క్యాన్సర్, ఎండోమెట్రియం క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, కాలేయం, నాలుక, ఎముకలు, ఊపిరితిత్తులు, మూత్రాశయం, గొంతు తదితర ప్రాంతాలకు సంబంధించిన క్యాన్సర్ కేసులు కూడా గుర్తించారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవి మానస



**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి)**
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఖమ్మం ఆధ్వర్యంలో ప్రభుత్వ దివ్యాంగ బాలుర వసతి గృహంలో దివ్యాంగుల కోసం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవి మానస పాల్గొని దివ్యాంగులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివ్యాంగులు స్వావలంబన సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దివ్యాంగజన్ కౌశల్ వికాస్ పథకం ద్వారా నైపుణ్యాభివృద్ధి అవకాశాలను, దివ్యాంగజన్ రోజ్‌గార్ సేతు ద్వారా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 ద్వారా దివ్యాంగులకు కల్పించిన హక్కులు, రక్షణలు, సమాన అవకాశాల గురించి వివరించారు. దివ్యాంగుల విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రతకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన దివ్యాంగులు తమ హక్కులను తెలుసుకొని సంక్షేమ పథకాల ప్రయో జనాలను పొందాలని సూచించారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం మరియు న్యాయ సలహా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎ. ప్రమీల, డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాదులు, సంబంధిత శాఖ సిబ్బంది మరియు దివ్యాంగులు పాల్గొన్నారు.



# యోగ పోటీల్లో ముస్లిం మైనార్టీ గురుకులం విద్యార్థినుల ప్రతిభ

**ఖమ్మం, (జనంసాక్షి) :**
ఖమ్మం జిల్లా యోగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ పోటీల్లో ఖమ్మం ముస్లిం మైనార్టీ గురుకులం బాలికలు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో 200 మందికి పైగా విద్యార్థినులు పాల్గొన్నారు. ముస్లిం మైనార్టీ గురుకులానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి యోగ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులను గురుకులం ప్రిన్సిపాల్ సీతామాలక్ష్మి, విజిలెన్స్ అధికారి సీతారాములు, వ్యాయామ ఉపాధ్యాయురాలు షేక్ సైదాబీ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలు, యోగ వంటి కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరచడం అభినందనీయమని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి గురుకులానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# పోలీస్ పోర్టల్‌లో అనుమతి తప్పనిసరి.. ఉల్లంఘిస్తే చర్యలు

- ○వినాయక మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి
- ○డీజే లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదు

**మర్రిగూడ,సెప్టెంబర్ 8 (జనంసాక్షి)**
రాబోయే వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నాంపల్లి సీఐ డి. రాజు, స్థానిక ఎస్ఐ బి. రాంబాబు సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వినాయక విగ్రహాల ఏర్పాటు కోసం మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందుగానే పోలీస్ పోర్టల్‌లో అనుమతి పొందాలని సీఐ, ఎస్ఐ స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయడం లేదా నిబంధనలకు విరుద్ధంగా కార్య క్రమాలు నిర్వహించడం చేయరాదని సూచించారు.

**డీజే లకు నో పర్మిషన్**
వినాయక చవితి ఉత్సవాల్లో డీజే లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమించి డీజే లు ఏర్పాటు చేస్తే సంబంధిత మండప నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలను సహించబోమని తెలిపారు. మండపాల వద్ద భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని, పోలీసుల సూచనలను పాటిస్తూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



**ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**
పోలీసులు సూచించిన నిబంధనలను ప్రతి మండప నిర్వాహకుడు తప్పనిసరిగా పాటించాలని సీఐ డి. రాజు, ఎస్ఐ బి. రాంబాబు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి మినహాయింపు లేకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా, స్నేహపూర్వక వాతావరణంలో జరిగేలా ప్రజలు, మండప నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని వారు కోరారు.

# జగన్నాధపురం లో కాంగ్రెస్ 1000 రోజుల ప్రగతి సంబరాలు

**ములకలపల్లి సెప్టెంబర్ 8 జనంసాక్షి :**
జగన్నాధపురం రైతు వేదికలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు రోజుల పూర్తి చేసుకున్న సందర్భంగా సర్పంచ్ కుంజా వినోద్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జగన్నాధపురం క్లస్టర్ పరిధిలో రైతు రుణమాఫీ ద్వారా సుమారు 3000 మంది రైతులకు 6 కోట్ల లబ్ది చేకూరిందని, రైతుభరోసా ద్వారా 2949 రైతులకు గాను 5.7 కోట్ల రూపాయలు నేరుగా రైతుల ఖాతాలలో జమ అయ్యాయని, రైతు బీమా ద్వారా 80 లక్షల రూపాయలతో 16 క్లయిమ్ లు చేయడం జరిగిందని అన్నారు. పంపిణీకాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందని అన్నారు. రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు రూ.1.70 లక్షల కోట్ల మేర నిధులు ఖర్చు చేసిందని ఆయన పేర్కొన్నారు.



# మున్సిపల్ లో సేవలందిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ కు ఉత్తమ సేవా పురస్కారం

## – మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్

హుజూర్‌నగర్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి) :
హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో 15 ఏళ్లుగా అంకితభావంతో సేవలందిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ కాటబోయిన వెంకటేశ్వర్లు (మాధవరాయనిగూడెం)కు జిల్లా స్థాయి ఉత్తమ సేవా అవార్డు లభించింది. సూర్యాపేట జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆయనను మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ వార్డు నుంచి 14వ వార్డు వరకు పారిశుధ్య సేవల్లో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు సేవలు అభినందనీయమన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో మున్సిపల్ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని చైర్మన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. అవార్డు రావడం ఆనందంగా ఉందని, ప్రోత్సహించిన కలెక్టర్, చైర్మన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మేరీగా అశోక్, కౌన్సిలర్లకు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దగ్గుపాటి కవితబాబురావు, పులిచింతల వెంకటరెడ్డి, అమరబోయిన సతీష్, దానమ్మ, కార్తీక్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ పోరాట అమరుడు కామ్రేడ్ సత్తెనపల్లి రామకృష్ణ త్యాగం స్ఫూర్తిదాయకం

## వర్ధంతి సందర్భంగా ఖానాపురం హవేలీలో మెగా రక్తదాన శిబిరం

**ఖమ్మం, (జనంసాక్షి) :**
2000 సంవత్సరంలో విద్యుత్ పోరాటంలో అమరుడైన కామ్రేడ్ సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సందర్భంగా కానాపురం హవేలీలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటానికి సీపీఎం పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కామ్రేడ్ పోతినేని సుదర్శన్ రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కామ్రేడ్ బుగ్గవీటి సరళ మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం పార్టీ హవేలి మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం పార్టీ రాష్ట్ర సెక్రెటరేట్ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు మరియు పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజల హక్కుల కోసం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, పేదలు?కార్మికులు?రైతుల ప్రయోజనాల కోసం జరిగిన పోరాటాల్లో అనేక మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని, అలాంటి అమరుల త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత అని అన్నారు. సత్తెనపల్లి రామకృష్ణ విద్యుత్ రంగంలో ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు జరిగిన పోరాటంలో ప్రాణత్యాగం చేశారని, ఆయన త్యాగం నేటికీ ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలుస్తోందని అన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రజలపై భారాలు పెరుగుతున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ వైపు నడిపించే విధానాలు కొనసాగుతున్నాయని, కార్మికుల హక్కులను పరిమితం చేసే విధానాలు అమలు చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ అనుకూల విధానాలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధానాలను వ్యతిరేకించి, ప్రజలకు అందుబాటులో ఉండే చౌకైన విద్యుత్ కోసం పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. విద్యుత్, విద్య, వైద్యం వంటి మౌలిక రంగాలు ప్రజల హక్కులుగా ఉండాలని, వాటిని వ్యాపార ప్రయోజనాలకు అప్పగించరాదని పేర్కొన్నారు. అమరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రక్తదానం ఒక గొప్ప సామాజిక బాధ్యత అని, అత్యవసర పరిస్థితుల్లో ఒకరి రక్తం మరొకరి ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు. అమరుడు సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం ద్వారా ఆయన





త్యాగాన్ని ప్రజాసేవతో స్మరించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర సెక్రరీడియట్ సభ్యులు ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరావు సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, సిపిఎం పార్టీ నాయకులు అట్లాగే యూత్ పిల్లలు రక్తదానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వైవిక్రమ్ జిల్లా సెక్రెటరీ సభ్యులు బొంతు రాంబాబు బండి పద్మ జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, ఎజీ జబ్బార్, బని మీరా సాహెబ్, పిన్నింటి రమ్య,ఎస్ నవీన్ రెడ్డి, భూక్య శ్రీను బండారు రమేష్ పి ఝాన్సీ, వన్ టౌన్ టూ టౌన్ కార్యదర్శులు బోడపట్ల సుదర్శన్ ఎస్కే మీరా డివిజన్ కమిటీ సభ్యులు మండల కమిటీ సభ్యులు యూత్ మహిళలు పాల్గొన్నారు.

# సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సౌకర్యం కల్పించాలి

## రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న పట్టణ ఆర్యవైశ్య సంఘం





**సూర్యాపేట (జనంసాక్షి):** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధన కోసం జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రిలే నిరాహార దీక్షలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న బెలిదె శ్రీనివాసులుతో పాటు దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పివిసి ఎండి మీలా మహదేవ్ వారికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పెద్దిరెడ్డి రాజా, గండూరి ప్రకాష్, జుట్టుకొండ సత్యనారాయణ, కర్నాటి కిషన్, ధర్మార్జున్ , వూర రామ్మూర్తి యాదవ్, రాపర్తి శ్రీనివాస్, మొరిశెట్టి కోటేశ్వరరావు, భూపతి రాములు, మిర్యాల వెంకటేశ్వర్లు, చల్లమల్ల నరసింహ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యపేటకు బుల్లెట్ ట్రైన్ సౌకర్యం కల్పించే వరకు పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పల సత్యనారాయణ, సంఘ ప్రధాన కార్యదర్శి బిక్కుమల్ల కృష్ణ, కోశాధికారి వుప్పల శ్రవణ్ కుమార్, బ్రహ్మాండ్లపల్లి మురళిధర్, చల్లా లక్ష్మయ్య, తోట శ్యామ్ ప్రసాద్, మంచాల రంగయ్య, కర్నాటి రవి, చల్లా లక్ష్మికాంత్, రాచకొండ శ్రీనివాస్, ఈగ దయాకర్ గుప్త, మిట్టపల్లి రమేష్, తాళ్లపెల్లి రామయ్య, సోమ వెంకటేశ్వర్లు, గుండా వెంకన్న, గుడిపాటి రమేష్, సోమ ప్రవీణ్, బెలిదె అంజయ్య, బెజగం ఫణి, మహిళా సంఘం అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ బెలిదె రాధ, తల్లాడ మోహన్, బొల్లం సురేష్, బోనగిరి కృష్ణ, తల్లాడ సోమయ్య, జూలకంటి నాగరాజు, సోమ సోమేశ్వర్, నవిలిపురి నరేందర్, మహంకాళి సోమయ్య, మహిళా సంఘం నాయకులు దేవరశెట్టి ఉమారాణి, లకుమారపు పద్మజ, అక్కినపల్లి సంతోషి, యర్కచర్ల శోభారాణి, డోగుపర్తి ప్రవీణ్, తోట లక్ష్మీనరసయ్య, ఓరుగంటి లావణ్య, దేవరశెట్టి ఉమారాణి, మిర్యాల సరిత, వజ్రపు సంతోషి, గుండా ప్రేమలత, కందిబండ జ్యోతి, నీలా ఉమారాణి పాల్గొన్నారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంపటి మధు ఆధ్వర్యంలో పలువురు మిల్లర్లు దీక్ష కు సంఘీభావం ప్రకటించారు.



# పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

## మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు

**చండూరు, సెప్టెంబర్ 8 (జనంసాక్షి)** పారిశుధ్య సిబ్బంది సమాజానికి అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని, వారి నిరంతర శ్రమ వల్లే ప్రజలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవిస్తున్నారని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో పారిశుధ్య కార్మికులకు సబ్బులు, బెల్లం, కొబ్బరి నూనెలను ప్లాస్టిక్ కవర్లకు బదులుగా పర్యావరణహితమైన జూట్ బ్యాగుల్లో అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధిలో పారిశుధ్య కార్మికులు అంతర్భాగమని, వారి సంక్షేమానికి పాలకవర్గం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా కార్మికులకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పునర్వి నియోగించగల జూట్ బ్యాగులనే వినియోగించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఎల్ మల్లేశం మాట్లాడుతూ.. ఎండ, వాన, చలిని సైతం లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే కార్మికుల ఆరోగ్యం, భద్రతకే తమ మొదటి ప్రాధాన్యతని తెలిపారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఈ పంపిణీ కార్యక్రమాన్ని వినూత్నంగా చేపట్టామని, పట్టణ ప్రజలు కూడా ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా పక్కనపెట్టి క్లాత్, జూట్ బ్యాగులను వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొన్రెడ్డి మధు, కటకం రమేష్, కో-ఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళ మారయ్య, మొగుదాల సత్తమ్మ వెంకన్న, షేక్ ఖలీల్, మున్సిపల్ మేనేజర్ జి. రాములు, వార్డ్ ఆఫీసర్లు జి. శ్రీరాములు, ఎ. జగన్, బి. సాయిరాం, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎం. అరవింద్ రెడ్డి, బిల్ కలెక్టర్లు మరియు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# అగ్రికల్చర్ కరెంట్‌కు కమర్షియల్ కనెక్షన్!

## రూ.లక్షల ముడుపులతో అక్రమ విద్యుత్ సరఫరా ఆరోపణలు.. ఏఈపై విచారణ ఎప్పుడూ?

## రైతులకు నిబంధనలు.. లంచాలిచ్చిన వారికి రెడ్ కార్పెట్ ?

**మాడుగులపల్లి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి ):** మాడుగులపల్లి విద్యుత్ శాఖలో అవినీతి అక్రమాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి మాడుగులపల్లి – కొత్తగూడెం గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఒక ప్రైవేట్ కమర్షియల్ భవనానికి అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నేరుగా అక్రమ కనెక్షన్ ఇవ్వడం వెనుక పెద్ద ఎత్తున లంచాలు చేతులు మారినట్లుగ్భ్రాంతికర విష యాలు వెలుగులోకి వస్తున్నాయి ఈ అక్రమ కనెక్షన్ లైన్ల షిఫ్టింగ్ కోసం సదరు కమ ర్షియల్ భవన యజమాని నుంచి స్థానిక ఏఈ ఏకంగా రూ. లక్ష రూపాయలు నొక్కినట్లు స్థానికంగా తీవ్రస్థాయిలో ప్రచారం సాగుతోంది

**రూ. లక్ష కోసం నిబంధనలు బొందపెట్టి**

ఏదైనా వ్యాపార లేదా కమర్షియల్ భవనానికి విద్యుత్ కనెక్షన్ కావాలంటే కమర్షియల్ మీటర్ అమర్చి, నిర్ణీత రుసుము చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. కానీ, సదరు ఏఈ మాత్రం జేబులు నింపుకోవడమే ధ్యేయంగా పెట్టుకొని రూ. లక్ష రూపాయల ముడుపులు స్వీకరించి, ఎటువంటి ఎస్టిమేషన్లు, మీటర్లు లేకుండానే వ్యవసాయానికి ఉద్దేశించిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచే నేరుగా సర్వీస్ వైర్లు కలిపి విద్యుత్ సరఫరా చేసేశారని ఆధారాలతో సహా బయటపడింది

**వరుస కథనాలు వచ్చినా మేనేజ్ మాస్టర్**

ఈ అక్రమ వ్యవహారంపై ఆధారాలతో సహా పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమైనప్పటికీ, ఉన్నతాధికారులు కనీసం విచారణకు కూడా రాకపోవడం వెనుక పెద్ద మర్మమే దాగి ఉందని మండల ప్రజలు అనుమానిస్తున్నారు లంచంగా తీసుకున్న సొమ్ములో కొంత భాగాన్ని పైస్థాయి అధికారులకు కూడా ముట్టజెప్పి, ఏఈ వ్యవహారాన్ని సమర్థవంతంగా మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి పత్రికల్లో వార్తలు వచ్చినా డిపార్ట్‌మెంట్ సైలెంట్‌గా ఉందంటే ఈ అక్రమాల్లో ఎవరెవరికి వాటాలు ఉన్నాయో అర్థమవుతోందని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

**రైతుల ఆగ్రహం ఉన్నతాధికారులైనా మేల్కొనేనా?**

పంట పొలాలకు కరెంట్ లైన్లు కావాలంటే ఎస్టిమేషన్ పేరుతో నెలల తరబడి వేధించే అధికారులు, రూ. లక్ష లంచం ఇవ్వగానే కమర్షియల్ భవనాలకు అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్లను కట్టబెట్టడంపై రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు లంచాల మత్తులో తూగుతున్న మాడుగులపల్లి ఏఈపై, ఆయన అక్రమాలకు సహకరిస్తున్న వారిపై తక్షణమే విచారణ జరిపి సస్పెండ్ చేయాలని, ఆ అక్రమ కనెక్షన్‌ను వెంటనే తొలగించాలని స్థానిక రైతులు, ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.



# పోలీసుల నిరంకుశత్వంపై బీఆర్ఎస్ భగ్గుమ్

## గుర్రంపోడులో పాశం గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళల భారీ ధర్నా

**గుర్రంపోడు, సెప్టెంబర్ 08 (జనంసాక్షి)** హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నేతలు, మాజీ మహిళా మంత్రుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో భారీ ధర్నా నిర్వహించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో మండల మహిళలు, పార్టీ శ్రేణులు రోడ్డుపైకి వచ్చి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అసెంబ్లీ పరిసరాల్లో ప్రజా సమస్యలపై నిరసన తెలుపుతున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, జగదీశ్వర్ రెడ్డి మాజీ మహిళా మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతలను పోలీసులు అడ్డుకున్న తీరుపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు . ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధులు అని కూడా చూడకుండా పోలీసులు వారి చీరలు పట్టి లాగుతూ, అత్యంత అసభ్యంగా ప్రవర్తించారని మండిపడ్డారు . ఈ ఘోర ఘటనను నిరసిస్తూ గుర్రంపోడు మండల మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం: పాశం గోపాల్ రెడ్డి ధర్నానుద్దేశించి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అవుతోందని ధ్వజమెత్తారు. చట్టసభల సాక్షిగా మహిళా నాయకులపై పోలీసులు జరిపిన దాడి ప్రభుత్వ నిరంకుశత్వానికి అద్దం పడుతోందని మండిపడ్డారు. తక్షణమే సదరు పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు రాజేశ్ రెడ్డి, వేముల యాదయ్య మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాడుతున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రభుత్వం అక్రమ కేసులు, అరెస్టులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ శ్రేణులు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రఘుపతి రెడ్డి, రావుల సైదులు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## జాజిరెడ్డిగూడెం పాఠశాలలో నేడు, రేపు మండల స్థాయి ఎస్ జీ ఎఫ్ క్రీడలు

**జాజిరెడ్డిగూడెం సెప్టెంబర్ 8 జనంసాక్షి:**
జాజిరెడ్డిగూడెంలోని జడ్పీహెచ్ఎస్ లో బుధ గురువారాలలో రెండు రోజులపాటు మండల స్థాయి క్రీడోత్సవాలు జరుగుతాయని ఎంఈఓ బి. బాలు నాయక్, క్రీడల కన్వీనర్ పీడీ లొడంగి సైదులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం తొలి రోజున జూనియర్ విభాగంలో 14 సంవత్సరాలు నిండిన విద్యార్థిని, విద్యార్థులకు, గురువారం సీనియర్ విభాగంలో 17 సంవత్సరాలు నిండిన విద్యార్థినీ, విద్యార్థులకు క్రీడలు జరుగుతాయని మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కస్తూరిభాగాంధీ, గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఈ క్రీడలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఓపెన్ చెస్ట్ సర్జరీ లేకుండానే అయోర్టా సమస్యకు చికిత్స..

## గజ్జల్లో చిన్న కోతతో స్టెంట్- గ్రాఫ్ట్ అమరిక..

**వివరాలు వెల్లడించిన కార్డియాలజిస్ట్ డాక్టర్ రాకేష్ రెడ్డి**




**కోదాడ,( జనం సాక్షి):**
ఛాతీ భాగంలోని అయోర్టా (మహాధమని) సంక్లిష్ట సమస్యలతో బాధపడుతున్న బాధితులకు ఓపెన్-చెస్ట్ సర్జరీ అవసరం లేకుండానే సోమాజిగూడ యశోద హాస్పిటల్స్‌లో 'థొరాసిక్ ఎండోవాస్క్యులర్ అయోర్టిక్ రిపేర్ ద్వారా అధునాతన చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి అసోసియేట్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాకేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సాధారణంగా ఓపెన్ అయోర్టిక్ సర్జరీలో ఎక్కువ ప్రమాదం ఉన్న బాధితులకు ఈ మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్స ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. గజ్జల్లోని రక్తనాళం ద్వారా క్యాథెటర్‌ను ప్రవేశపెట్టి, ప్రత్యేకమైన స్టెంట్ గ్రాఫ్ట్‌ను దెబ్బతిన్న అయోర్టా వద్దకు చేర్చి లోపల నుంచి సీల్ చేస్తారని తెలిపారు. థొరాసిక్ అయోర్టిక్ అన్యూరిజం, డిసెక్షన్, అల్సర్ వంటి తీవ్ర సమస్యలకు పూర్తి ఆరోగ్య పరీక్షలు, సిటీ యాంజియోగ్రఫీ వివరాలు ఆధారంగా ఈ చికిత్సను నిర్ణయిస్తామన్నారు. నిపుణులైన కార్డియాలజిస్టులు, సర్జన్లు, అనస్థీషియా బృందం సమన్వయంతో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ ఉమేష్ అసిస్టెంట్ మేనేజర్ రామ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు..

## ప్రశాంతంగా వినాయక చవితి నిర్వహించాలి
## ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి

**వలిగొండ, సెప్టెంబరు 8 (జనంసాక్షి)**
వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి కోరారు. మండపాలకు సంబంధిత శాఖల అనుమతులు తీసుకోవాలని, డీజేలు, అధిక శబ్ద పరికరాల వినియోగంపై నిబంధనలు పాటించాలని సూచించారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.




## ధ్వనివ్యవస్థలు లేకుండా గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

**హాలియాలో మండపాల నిర్వాహకులతో మిర్యాలగూడ డీఎస్పీ**



**హాలియా, సెప్టెంబర్ 8 జనంసాక్షి:**
గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో.. అధిక ధ్వని కలిగించే సంగీత పరికరాలకు దూరంగా నిర్వహించాలని మిర్యాలగూడ డీ ఎస్పీ జి. రవి సూచించారు. హాలియా పట్టణంలోని గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అధిక ధ్వని కలిగించే సంగీత పరికరాలను ఉపయోగించకుండా ఉత్సవాలను నిర్వహించడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఉత్సవాలు, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని సూచించారు. ప్రతి ఒక్కరి స్వచ్ఛంద సహకారంతో అధిక ధ్వని పరికరాలు లేకుండా, భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హాలియా వృత్త నిరీక్షకుడు ఎస్. రాఘవరావు, ఉప నిరీక్షకుడు బి. సాయి ప్రశాంత్, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## తమ్మడపల్లిలో భూ పునఃసర్వే ప్రారంభం

**90 ఏళ్ల నాటి రికార్డులకు ఆధునిక సాంకేతికతతో స్వస్తి**

**1,170 ఎకరాల భూముల కొలతలు**



**మర్రిగూడ, సెప్టెంబర్ 8 (జనంసాక్షి)**
నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం తమ్మడపల్లి గ్రామంలో మంగళవారం భూ పునఃసర్వే ప్రారంభమైంది. ఆధునిక రోవర్ సాంకేతికతతో గ్రామంలోని సుమారు 1,170 ఎకరాల భూములను కొలవనున్నారు. తొలిరోజు గ్రామ పొలిమేరలను సర్వే చేసి సరిహద్దులను నిర్ధారించారు. సుమారు 90 ఏళ్ల నాటి సర్వే రికార్డుల ఆధారంగా భూముల హద్దులు, రికార్డులకు సంబంధించి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆధునిక సాంకేతికతతో రీ-సర్వే చేపట్టిందని అధికారులు తెలిపారు. ముందుగా గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, చెరువులు, రహదారులను గుర్తించి, అనంతరం పట్టా భూములను సర్వే చేయనున్నట్లు పేర్కొన్నారు. భూ రికార్డుల్లోని తప్పులను సరిచేసి, భవిష్యత్తులో భూ వివాదాలను తగ్గించేందుకు ఈ సర్వే దోహదపడుతుందని తెలిపారు. ప్రతి భూ యజమాని సంబంధిత పత్రాలతో సర్వే సమయంలో అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలని సూచించారు. అనంతరం ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు రూపొందించి యుఎల్పిఐఎన్ నంబర్లు, భూధార్ కార్డులు జారీ చేసే ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ పాండురంగారెడ్డి, సర్వేయర్ స్వప్న, మాజీ సర్పంచ్ ఈడగొని కృష్ణయ్య, వార్డు సభ్యులు యంజాల శ్రీనివాస్, నజీర్, నాయకులు కొట్టం శ్రీనివాస్, మల్‌రెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా వినాయక ఉత్సవాలు నిర్వహించుకోవాలి
## సిఐ శ్రీనివాస్ నాయక్

**తిరుమలగిరి (సాగర్) సెప్టెంబరు 08 (జనంసాక్షి):**
తిరుమలగిరి (సాగర్) మండల పరిధిలో వినాయక విగ్రహాల ప్రతిష్ఠ, నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డీజేలు వినియోగంపై నిషేధం తదితర అంశాలపై మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో నాగార్జునసాగర్ సిఐ శ్రీను నాయక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విగ్రహాల ప్రతిష్ఠ నుంచి నిమజ్జనం వరకు శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. నిమజ్జనం సమయంలో భక్తులు, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు. అలాగే డీజేలు వినియోగించరాదని స్పష్టం చేశారు. తిరుమలగిరి సాగర్ ఎస్ఐ వీర శేఖర్, ఆయా గ్రామాల సర్పంచులు, వినాయక మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.




## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**సూర్యాపేట (జనంసాక్షి) :**
జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం సూర్యాపేట మండల యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదగాని నాగేశ్వరరావు, శనగల యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ కంటి హాస్పిటల్, సూర్యాపేట వారి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ వైద్య శిబిరంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పెన్షనర్లు,ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన వారు, రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు,జర్నలిస్టులు,అర్హులైన రేషన్ కార్డు కలిగిన వారు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అక్షర జ్ఞానంతోనే మహిళా సాధికారత



**కోదాడ( జనం సాక్షి):**
అక్షర జ్ఞానంతోనే మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించగలరని ఉమ్మడి నల్లగొండ జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కోదాడ పట్టణంలోని మండల స్వయం సహాయక సంఘాల కార్యాలయంలో మహిళలకు అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యుల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి అక్షరాస్యత ప్రాధాన్యతను వివరించారు. అనంతరం సుమారు మూడు వందల మంది మహిళలతో పట్టణంలో అవగాహన సదస్సు నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. మహిళలు చదువుకోవడం ద్వారా తమ హక్కులు, బాధ్యతలు, ప్రభుత్వ పథకాలు, ఆర్థిక అంశాలపై అవగాహన పెంచుకోవచ్చని అధికారులు వివరించారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు అక్షరాస్యులైతే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలను చైతన్యపరిచి, అక్షరాస్యత కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వయోజన విద్య అడిషనల్ పీడీ సురేష్, ఏపీఎం వెంకన్న, సీసీ రామకృష్ణ, చిన్ని, కోదాడ, అనంతగిరి మండల అధ్యక్షులు నాగలక్ష్మి, కవిత తదితరులు పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

**తుర్కపల్లి ,సెప్టెంబర్ 8 (జనంసాక్షి)**
తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్ కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకారెడ్డి పరిశీలించారు .ఈ సందర్భంగా సర్ కార్యక్రమంలో నోటీసులు వచ్చిన అభ్యర్థులను డాక్యుమెంటేషన్ ,ఇయరింగ్, హాజరు తో పాటు పూర్తి చేశారు. నో మ్యాపింగ్ రాలేదని బిఎల్ఓ లను అభినందించారు .సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి తప్పులు లేకుండా సరిచేయాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవికుమార్, పంచాయితీ కార్యదర్శి నరేష్, బిఎల్వోలు నారా భాగ్య, పలుగుల సరిత, కారోబార్ దుడుక బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం!

- 48 గంటల్లో సమస్యలు పరిష్కరించకపోతే 1000 మంది రైతులతో కార్యాలయాల ముట్టడి
- ఎరువుల స్టాక్ వివరాలు ముందుగానే ప్రకటించాలి
- బోనస్ లబ్ధిదారులందరి పేర్లు నమోదు చేయాలి



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 8, జనంసాక్షి**
అన్నపురెడ్డిపల్లి మండల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే చూస్తూ ఊరుకునేది లేదని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. రైతుల సమస్యలపై మండలంలోని అబ్బుగూడెం గ్రామంలో రైతులతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. సమస్యలపై 48 గంటల్లో అధికారులు స్పందించక పోతే త్వరలోనే 1000 మంది రైతులతో మండల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మండలంలో ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రైవేట్ ఫెర్టిలైజర్ డీలర్ల వద్ద ఉన్న యూరియా, ఇతర ఎరువుల స్టాక్‌ను ఎప్పుడు యాప్‌లో నమోదు చేశారో, ఏ సమయం నుంచి ఎన్ని కట్టలు అందుబాటులో ఉంటాయో ముందుగానే రైతులకు, సంబంధిత గ్రూపుల్లో సమాచారం అందించాలని డిమాండ్ చేశారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత పాటించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. అలాగే బోనస్‌కు సంబంధించి ఎటువంటి ఆంక్షలు లేకుండా అర్హులైన రైతులందరి పేర్లను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు నీటితో మండలంలోని చెరువులను నింపి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఇప్పటివరకు మండ లంలో ఎరువులు పొందిన రైతుల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

### 48 గంటల డెడ్‌లైన్

రైతుల సమస్యలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. 48 గంటల్లో సమస్యలపై స్పందించక పోతే 1000 మంది రైతులతో మండల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ధర్నా సందర్భంగా పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతుల సమస్యలను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు. ఈ కార్యక్రమంలో వేముల హరీష్, మాజీ ఎంపీటీసీ ఐలూరి, కృష్ణారెడ్డి, చెరుకూరి ప్రసాద్, అచ్చన రామకృష్ణ, పెంట్లం సర్పంచ్ కారం శివ, అబ్బుగూడెం సర్పంచ్ కూరం రాము, నర్సాపురం మాజీ సర్పంచ్ నల్లబోతుల రాములు, ఇనుపనూరి రాంబాబు, చెన్నుబోయిన సత్యం, అన్నపరెడ్డి సుబ్బారావు, కాసిని శ్రీను, తిరుపతిరావు, ఇటుకల సత్యం, ఇటుకల హరి, గుణగంటి శ్యామ్, సుభాని, బేతి శివ, మహమ్మద్ అలీ, ఆరిఫ్, సురేష్, వెంకటేష్, అల్లాడి వినోద్, చిలుకూరి వెంకటరెడ్డి, మహంకాళి తిరుపతయ్య, చిలుకూరి శ్రీనివాసరెడ్డి, గోపిశెట్టి అంజయ్య, పెద్దగుల వెంకటకృష్ణ, పర్సా నాగరాజు, సంపత్, ఇనుపనూరి విషాక్, కారం వీరభద్రం, బాణావత్ వెంకటేశ్వర్లు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# తప్పుడు ఆరోపణలపై పోలీసులకు ఫిర్యాదు

**- సర్పంచ్, ఉపసర్పంచ్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 08 (జనంసాక్షి)**
సర్పంచ్, ఉపసర్పంచ్‌లపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వారి ప్రతిష్ఠను దెబ్బతీసేలా ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నిరాధార ఆరోపణలు, అసత్య ప్రచారంతో ప్రజల్లో అపోహలు కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేపట్టి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని, తప్పుడు ఆరోపణలకు పాల్పడుతున్న వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. ప్రజాప్రతినిధుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా నిరాధార ప్రచారాలను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. నిజానిజాల విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, అసత్య ప్రచారాలకు చట్టమే సమాధానం చెబుతుందని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.

### కబడ్డీ జూనియర్ సబ్ జూనియర్ జిల్లా స్థాయి పోటీలు

**మునగాల, సెప్టెంబర్ 08(జనంసాక్షి):** సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ జూనియర్ సబ్ జూనియర్ జిల్లా స్థాయి పోటీలు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లం ప్రభాకర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ విభాగంలో బాలురు 20 సంవత్సరాల లోపు వయస్సు కలిగి 75 కేజీల లోపు బరువు ఉండాలని, సబ్ జూనియర్ విభాగంలో బాలికలు 16 సంవత్సరాల లోపు వయస్సు కలిగి 55 కేజీల లోపు బరువు ఉండాలని, సెలక్షన్స్ కు హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, పదవ తరగతి ఉత్తీర్ణత పత్రం తమ వెంట తీసుకొని రావాలని కోరారు. వివరాలకు 9573962957, 9704095937 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

### అర్వపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



**అర్వపల్లి సెప్టెంబర్ 08 (జనంసాక్షి)**
అర్వపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను మంగళవారం తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్, సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్ ల చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్ రెడ్డి, జీ పీ ఓ అజయ్, ఉపసర్పంచ్ మామిడి శ్రీనివాస్, డీ సీసీ కార్యదర్శి వేల్పుల రమేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సాయిని మనోహర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బైరబోయిన మహారాజ్, మామిడి శ్రీనివాస్, పోతరాజు, శ్రీనివాస్, పులిచర్ల నరహరి, పొన్న శ్రీనివాస్, బింగి లింగమ్మ, పులిచెర్ల సూర్య కళ, దావుల యశోద, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య కులంలో జన్మించిన గొప్ప వ్యక్తి - సత్యవరపు సంపూర్ణ

**6 ఏళ్లుగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా విశేష సేవలు**

**పార్టీ అధిష్టానం ఆదేశాలతో కార్యక్రమాలు దగ్గరుండి పరివేక్షించే నాయకుడు...**

**కాసాని పద్మ నివాసంలో ఘన సత్కారం**

**అశ్వరావుపేట సెప్టెంబర్ 8,(జనంసాక్షి):**
ఆర్యవైశ్య కులంలో పుట్టి వ్యాపార, వాణిజ్య రంగంలోనే కాకుండా రాజకీయ, సేవా రంగాల్లోనూ తనదైన ముద్ర వేసుకున్న గొప్ప వ్యక్తిగా, ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవి మాత ఆశీస్సులతో, దానధర్మాలు, నిజాయితీ, క్రమశిక్షణ, వ్యాపార దక్షతకు ప్రతీకగా నిలిచే ఆర్యవైశ్య కుల గౌరవాన్ని పెంచుతున్న నాయకుడిగా సత్యవరపు సంపూర్ణ మండల వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నరు, గత 6 సంవత్సరాలుగా భారత రాష్ట్ర సమితి అశ్వారావుపేట పట్టణ అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ పార్టీ కార్యక్రమాలను దగ్గరుండి విజయవంతంగా నిర్వహిస్తూ కార్యకర్తలకు అండగా నిలుస్తూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్న కీలక నేతగా ఎదిగారని, పార్టీ కోసం ఆయన పడిన కష్టాన్ని, చేసిన సేవలను, పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి ఈరోజు మండల కేంద్రంలో కాసాని పద్మ నివాసం వద్ద పార్టీ నాయుకులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారని, ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్యవైశ్య కులంలో జన్మించిన సంపూర్ణ పార్టీకి వెన్నెముకగా నిలుస్తూ, అందరినీ కలుపుకుపోయే మనస్తత్వంతో, పెద్దలంటే గౌరవం, చిన్నలంటే ఆప్యాయత చూపుతూ, ఏ కార్యక్రమం అయినా తన భుజాలపై వేసుకుని విజయవంతం చేసే నాయకుడని, భవిష్యత్తులో పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి అశ్వారావుపేట అభివృద్ధికి తోడ్పడాలని కొనియాడారు .ఈ కార్యక్రమంలో కాసాని పద్మ–చంద్రమోహన్, కౌన్సిలర్ ఉదయ జ్యోతి –ప్రసాదు, జుజ్జరపు శ్రీరామ్ మూర్తి, గుడవర్తి వెంకటేశ్వర్లు,ఓగ్గిలా పూజా, మోటూరి మోహన్, కొనసోతు నవీన్, ఎస్.కె రఫీ, శెట్టిపల్లి రఘురాం, పాలవలస జీవన్,అఖిల్, కిరణ్, రమేష్ మరియు మండల వ్యాప్తంగా కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

## జాతీయ ఆరోగ్య ఆధ్వర్యంలో అమలవుతున్న వైద్య పరీక్షలు పర్యవేక్షించాలి: డిఎంహెచ్ ఓ



కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 08 (జనంసాక్షి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పాల్వంచలోని డిప్యూటీ డీఎంహెచ్ఓ కొత్తగూడెం కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఆరోగ్య సూపర్‌వైజర్ల సమిక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. తుకారామ్ రాథోడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డా. భూక్యా రామ్‌దాస్, డా. టి. ప్రతాప్, డా. దినేష్‌తో పాటు కార్యక్రమ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని డీఎంహెచ్ఓ సమిక్షించారు. ముఖ్యంగా గర్భిణీల నమోదు, నిరంతర వైద్య పరీక్షలు, అసంక్రమణీయ వ్యాధుల గుర్తింపు పరీక్షలు, చిన్నారుల ఆరోగ్యం, టీకాల కార్యక్రమం, జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమం తదితర అంశాలను మండలాల వారీగా పరిశీలించారు. ప్రతి గర్భిణీని సకాలంలో నమోదు చేసి, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అధిక ప్రమాద గర్భిణీలను ప్రత్యేకంగా గుర్తించి నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధిక రక్తపోటు, మధుమేహం వంటి అసంక్రమణీయ వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు స్క్రీనింగ్ కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా నిర్వహించాలని తెలిపారు. వ్యాధులు గుర్తించిన వారికి సకాలంలో చికిత్స అందించడంతో పాటు నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. టీకాలకు అర్హులైన ప్రతి చిన్నారికి జాతీయ టీకాల షెడ్యూల్ ప్రకారం టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టీకాలు మిస్ అయిన పిల్లలను గుర్తించి, వారికి అవసరమైన టీకాలు ఇప్పించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్ఠు వ్యాధిగ్రస్తుల చికిత్సపై ప్రత్యేకంగా సమిక్ష నిర్వహించారు. చికిత్స పొందుతున్న కుష్ఠు వ్యాధి రోగులకు బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ) మందులను ఆరోగ్య సూపర్‌వైజర్లకు పంపిణీ చేశారు. రోగులు చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా వైద్యుల సూచనల మేరకు పూర్తి మందుల కోర్సును క్రమం తప్పకుండా కొనసాగించేలా ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షించాలని డీఎంహెచ్ఓ సూచించారు. ప్రతి రోగిని నిరంతరం అనుసరిస్తూ మందుల వినియోగం, చికిత్స పురోగతి, తదుపరి వైద్య సేవలను పర్యవేక్షించాలని ఆదేశించారు. కుష్ఠు వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, వ్యాధి నయం చేయగలదనే విషయాన్ని విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. వ్యాధిని సకాలంలో గుర్తించి పూర్తి స్థాయి చికిత్స తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సంబంధిత ఆరోగ్య సిబ్బంది పాల్గొని తమ పరిధిలో అమలవుతున్న కార్యక్రమాల పురోగతిని వివరించారు. జిల్లాలో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని డీఎంహెచ్ఓ డా. తుకారామ్ రాథోడ్ సూచించారు.



# వినాయక చవితి పండుగను మత సామరస్యంతో జరుపుకోవాలి: డీఎస్పీ

**○ఘర్షణ లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి**

**○మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి. డి.ఎస్.పి రవీందర్ రెడ్డి**

**మణుగూరు, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** గణపతి నవరాత్రి ఉత్సవాలను మతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మణుగూరు డి.ఎస్.పి రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సబ్ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్సవాలకు సంబంధించి పలు కీలక సూచన చేశారు. ముందుగా పినపాక నియోజకవర్గం లోని అన్ని మతాల నాయకులు మాట్లాడారు. అనంతరం డిఎస్పి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.... సమాజంలో భిన్నత్వంలో ఏకత్వం ఉన్నప్పుడే శాంతినెల కొంటుంది. అందరూ కలిసి పండుగలు జరుపుకున్నప్పుడు పరస్పర గౌరవం పెరుగుతుంది. ఇది ఘర్షణ లేకుండా ప్రశాంతమైన వాతావరణానికి దారితీస్తుంది. నేటి తరం పిల్లలు పెద్దలను చూసి సమాజంలో ఎలా నడుచుకోవాలో నేర్చుకుంటారు. అందరూ కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం వలన పిల్లల్లో సమానత్వం దేశభక్తి సేవా గుణం అలవడుతుందని తెలిపారు.

**మండపాలకు అనుమతులు తప్పనిసరి:**

మణుగూరు మండలంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాలకు పోలీసుల అనుమతులు తప్పనిసరి తీసుకోవాలి. ప్రతి మండపం వద్ద రాత్రి వేళల్లో కాపలా ఉండేందుకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసేందుకు ఉత్సవ కమిటీ సభ్యులే కొంతమంది వాలంటీర్లను నియమించుకోవాలి. రాత్రి వేళల్లో మైక్ సెట్ ,డీజేలా శబ్దాలు వాటి వాడకంపై కోర్టు నిబంధన ప్రకారం ఖచ్చితమైన సమయ పరిమితులు ఉంటాయి సాదరణంగా రాత్రి 10 గంటలకు మైక్ లు అనుమతించబడదు. నిమజ్జనం, ఉత్సవాల వేళల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిమజ్జనానికి ప్రత్యేకంగా కేటాయించిన చెరువులు, వాగులు, నది ప్రాంతాలలో మాత్రమే నిమజ్జనం చేయాలి.





**మట్టి విగ్రహాలు వినియోగం:**

రసాయన రంగులకు చేసే విగ్రహాల కంటే మట్టి విగ్రహాలు ఎంతో శ్రేష్టమైనవి. పర్యావరణానికి హాని కలిగించే రంగులు కెమికల్స్ ఉన్న విగ్రహాలను వాడకూడదు. వీలైనంతవరకు మట్టి విగ్రహాలను ప్రతిష్టించేలా చూడాలి. మట్టి విగ్రహాలు నిమజ్జనం చేయడం వల్ల నీటి జీవులకు ఎలాంటి హాని జరగదు. మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం లోని మత పెద్దలు, మణుగూరు సిఐ నాగబాబు, ఈ బయ్యారం సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రాజేష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర సలహా బోర్డు నుండి కార్మిక సంఘాల తొలగింపు సరికాదు

### సిఐటియు జిల్లా నేత షేక్ యాకూబ్

**గరిడేపల్లి, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** కేంద్ర కార్మిక సంఘాల సలహా బోర్డు నుండి సిఐటియు, ఏఐటియుసి, ఐఎన్టియుసి వంటి ప్రధాన కార్మిక సంఘాలను తొలగించడం సరైన పద్ధతి కాదని సిఐటియు జిల్లా నాయకులు షేక్ యాకూబ్ అన్నారు. గరిడేపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుకూల సంఘాలతోనే బోర్డు నడపాలని కేంద్రం చూడటం కార్మిక వ్యతిరేక చర్య అని విమర్శించారు. వెంటనే అన్ని కేంద్ర కార్మిక సంఘాలను బోర్డులో కొనసాగించాలని లేకుంటే దేశవ్యాప్త ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిపి యూనియన్ అధ్యక్షులు కొండ సైదులు, గౌరవ అధ్యక్షులు గోపగాని సత్యనారాయణ, రావుల వెంకన్న, బొంత వెంకటరెడ్డి, ఉమా, సైదమ్మ, సైదులు, లక్ష్మమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## సేర్ప్ విద్యాశాఖఆధ్వర్యంలో ర్యాలీ

కల్లూరు సెప్టెంబర్ 8(జనం సాక్షి)

సెర్ప్ విద్యాశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా కల్లూరు లో ర్యాలీ నిర్వహించారు. చదువుకుందాం రండి చదువు నేర్పుదాం పదండి . అందరికీ విద్య మనందరి బాధ్యత , అక్షరాస్యత పక్షోత్సవాలు అంటూ ఫ్లెక్సీతో ప్రజలను చైతన్య పరుస్తూ వివిధ శాఖల అధికారులు విద్యార్థులతో కలిసి ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ , విద్యాశాఖ అధికారి పొదిలి పద్మ, ఐకెపి ఎపిఎం , హై స్కూల్ విద్యార్థులు, సెర్ప్ సిబ్బంది , ఎస్ హెచ్ జి మెంబర్స్ మెప్మా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## కారు డ్రైవర్ కుమారుడికి ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీటు



జాజిరెడ్డిగూడెం సెప్టెంబర్ 8 (జనంసాక్షి)

జాజిరెడ్డిగూడెం మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన జాల అంజయ్య-అరుణల కుమారుడు జాల సాత్విక్ నీట్ ఫలితాల్లో సత్తా చాటాడు. తండ్రి అంజయ్య సాధారణ కార్ డ్రైవర్‌గా పనిచేస్తూ కష్టపడి చదివించాడు. తల్లిదండ్రుల కష్టాన్ని చూసి పెరిగిన సాత్విక్, పట్టుదలతో చదివి జాతీయ స్థాయిలో 32,534వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 437వ ర్యాంక్ సాధించాడు. ఈ ప్రతిభతో రాష్ట్రంలోనే అత్యుత్తమమైన 'ఉస్మానియా మెడికల్ కాలేజీ'లో మెడికల్ సీటు దక్కించుకున్నాడు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ కొడుకుని ఉన్నతంగా తీర్చిదిద్దిన అంజయ్య, అరుణ దంపతులను, సాత్విక్‌ను కోమటిపల్లి గ్రామస్తులు అభినందించారు.

## క్షయ రహిత సమాజ నిర్మాణంకు ప్రతి పౌరుడు కృషి చేయాలి

**నూతనకల్ సెప్టెంబర్ 8 ( జనంసాక్షి)**

క్షయ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి పౌరుడు కృషి చేయాలని సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయుష్మాన్ ఆరోగ్య శివర్ కార్యక్రమంలో భాగంగా చాతి ఎక్స్ రే శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ఓ చరణ్ నాయక్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు బరువు కోల్పోవడం తెమడలో రక్తజీరలు రాత్రి వేళల్లో జ్వరం ఉన్నట్లయితే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ పరీక్ష నిర్వహించి ఉచితంగా మందులు అందించడం జరుగుతుందని వారు తెలిపారు. శిబిరంలో 100 మందికి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శర్మ వైద్య సిబ్బంది సీతారాం రెడ్డి నగేష్ జ్యోతి ప్రసాద్ మాధవరెడ్డి రవిశర్మ ఆశాలు రాజేశ్వరి రేణుక సంతోష సుహాసిని తదితరులు ఉన్నారు.



# ఖానాపురం హవేలీలో మెగా రక్తదాన శిబిరం

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 8 (జనంసాక్షి)**

2000 సంవత్సరంలో విద్యుత్ పోరాటంలో అమరుడైన కామ్రేడ్ సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సందర్భంగా కానాపురం హవేలీలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటానికి సీపీఎం పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కామ్రేడ్ పోతినేని సుదర్శన్ రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కామ్రేడ్ బుగ్గవీటి సరళ మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం పార్టీ హవేలి మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం పార్టీ రాష్ట్ర సెక్రెటరేట్ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు మరియు పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజల హక్కుల కోసం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, పేదలు?కార్మికులు?రైతుల ప్రయోజనాల కోసం జరిగిన పోరాటాల్లో అనేక మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని, అలాంటి అమరుల త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత అని అన్నారు. కామ్రేడ్ సత్తెనపల్లి రామకృష్ణ విద్యుత్ రంగంలో ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు జరిగిన పోరాటంలో ప్రాణత్యాగం చేశారని, ఆయన త్యాగం నేటికీ ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలుస్తోందని అన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రజలపై భారాలు పెరుగుతున్నాయని,



ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ వైపు నడిపించే విధానాలు కొనసాగుతున్నాయని, కార్మికుల హక్కులను పరిమితం చేసే విధానాలు అమలు చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ అనుకూల విధానాలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధానాలను వ్యతిరేకించి, ప్రజలకు అందుబాటులో ఉండే చౌకైన విద్యుత్ కోసం పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. విద్యుత్, విద్య, వైద్యం వంటి మౌలిక రంగాలు ప్రజల హక్కులుగా ఉండాలని, వాటిని వ్యాపార ప్రయోజనాలకు అప్పగించరాదని పేర్కొన్నారు. అమరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రక్తదానం ఒక గొప్ప సామాజిక బాధ్యత అని, అత్యవసర పరిస్థితుల్లో ఒకరి రక్తం మరొకరి ప్రాణాలను కాపాడగలదని పేర్కొన్నారు. అమరుడు సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం ద్వారా ఆయన త్యాగాన్ని ప్రజాసేవతో స్మరించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర సెక్రెడియట్ సభ్యులు ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరావు సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్ మరియు సిపిఎం పార్టీ నాయకులు అట్లాగే యూత్ పిల్లలు రక్తదానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వైవిక్రమ్ జిల్లా సెక్రెటరీ సభ్యులు బొంతు రాంబాబు బండి పద్మ జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, ఎజీ జబ్బర్, బని మీరా సాహెబ్, పిన్నింటి రమ్య,ఎస్ నవీన్ రెడ్డి, భూక్య శ్రీను బండారు రమేష్ పి ఝాన్సీ, వన్ టౌన్ టూ టౌన్ కార్యదర్శులు బోడపట్ల సుదర్శన్ ఎస్కే మీరా డివిజన్ కమిటీ సభ్యులు మండల కమిటీ సభ్యులు యూత్ మహిళలు పాల్గొన్నారు.